క్లుప్తంగా

గోశాలకు దాణా అందజేత



గుడివాడ టౌన్: స్థానిక దనియాలపేటలోని ప్రణవాశ్రమ గోశాలకు రోటరీక్లబ్ గుడివాడ సభ్యులు దాణా అందజేశారు. క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ వై. రెడ్డయ్య చౌదరి వితరణతో రూ. 30 వేలు విలువగల 36 బస్తాల దాణాను గోశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా గోశాల వ్యవస్థాపకుడు కేడీఎస్‌వీ శ్రీనివాస్ మాట్లాడుతూ గోవుల సంరక్షణకు స్వచ్ఛంద సేవాసంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మూగ జీవాలను పోషించడం మానవ బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వై. నాగేశ్వరరావు, జి. కిరణ్‌బాబు, ఎం.రమణమూర్తి, వై. లక్ష్మీ నర్మద, పి. చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం దేవతామూర్తుల విగ్రహాల ఏర్పాటుకు భక్తులు వితరణ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. స్థానిక రాజేంద్రనగర్‌కు చెందిన శ్రీ లక్ష్మీ చరణ్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం జి.నాగేశ్వరరావు–వెంకటలక్ష్మి దంపతులు రూ. 10,116 వితరణగా అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ కార్మికులు రిలే నిరాహారదీక్ష



గుడివాడ టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాల వలన కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆర్టీసీ ఏపీ పీటీడీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. డిపో మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలు, కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. తక్షణమే వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కేఎస్ రావు, జేఎల్ఎన్‌వీకే మూర్తి, కేవీ సుబ్బారావు, కేపీ సాయి, ఎస్.ఎల్. రావు తదితరులు పాల్గొన్నారు.

11న అప్రంటీస్ మేళా

గుడివాడ టౌన్: స్థానిక కేబీఆర్ గవర్నమెంట్ ఐటీఐ కళాశాల్లో ప్రధానమంత్రి నేషనల్ అప్రంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఓ. మంజులాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనే ఈ మేళాలో అన్ని కోర్సులకు సంబంధించిన అప్రంటీస్‌కు అవకాశం ఉంటుందని తెలిపారు. ఐటీఐ పాసై అప్రంటీస్ చేయని అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాల్గొనాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు 08674-295953 సంప్రదించాలని పేర్కొన్నారు.

డెప్యూటీ ఎంపీడీఓగా అంజనాదేవి



గుడ్లవల్లేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డెప్యూటీ ఎంపీడీఓగా జి.ఎస్.ఎస్.అంజనాదేవి సోమవారం విధుల్లో జాయిన్ అయ్యారు. ఆమెకు ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్, గుడ్లవల్లేరు గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. వారితో పాటు గ్రామ సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది అభినందించిన వారిలో ఉన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం



పమిడిముక్కల: వీరంకి గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ, గ్రామ పెద్దలు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ప్రజలకు ఇంటి వద్దనే సేవలందించేందుకు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు సుప్రజ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కాసాని నాగేశ్వరమ్మ, హిదయతుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పమిడిముక్కల మండలంలో గుంతలమయంగా మారిన మంటాడ–ఉయ్యూరు రోడ్డు



పమిడిముక్కల మండలంలో కృష్ణాపురం వంతెన వద్ద కుంగిన రహదారి

నరకప్రాయంగా గ్రామీణ రహదారులు

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు నరకప్రాయంగా మారాయి. ఈ రహదారులపై రాకపోకలు సాగించడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని నందిగామలంక, పెనుమాకలంక, శ్రీరామనగర్ రోడ్లపై రాకపోకలు సాగించడానికి ఇక్కట్లు తప్పడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. వర్షం కురిస్తే రహదారులపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచి పాదచారులు, ద్విచక్రవాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. రాత్రి వేళల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. రహదారులను అభివృద్ధి చేసి, ఇబ్బందులు తొలగిస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి నాయకులు వెంటనే వాటిని బాగుజేసి రహదారి సౌకర్యం కల్పించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



మండవల్లి మండలంలో బురదమయంగా మారిన నందిగామలంక–పెనుమాకలంక రహదారి

అధ్వానంగా మంటాడ–ఉయ్యూరు రోడ్డు

పమిడిముక్కల: మంటాడ శివాలయం నుంచి ఉయ్యూరు కేసీపీ వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో రాకపోకలు సాగక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ప్రయాణించేందుకు అవకాశం లేక బైపాస్ నుంచి ఉయ్యూరుకు రాకపోకలు సాగిస్తున్నారు. రహదారికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రహదారి

మంటాడ–లంకపల్లి ప్రధాన రహదారిపై కృష్ణాపురం వంతెన వద్ద రహదారి ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రాంతంలో రహదారి గుంతలు పడి కుంగిపోయి ఉంది.

రాత్రి వేళల్లో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిపై అధిక సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజల వద్దకు పోలీస్'

తోట్లవల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజల వద్దకు పోలీస్ నిర్వహిస్తున్నట్లు గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ప్రజల వద్దకు పోలీస్ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి డీఎస్పీ ధీరజ్ వినీల్ హాజరై ప్రజల వద్ద నుంచి పలు ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రతి వారం ఒక పోలీస్‌స్టేషన్‌లో ప్రజల వద్దకే పోలీస్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు నేరుగా వచ్చి ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలీసులతో పరిష్కారం కాని సమస్యలను ఇతర శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. పోలీసులను స్నేహితులుగా ప్రజలు భావించాలని సూచించారు. తప్పు చేసిన వారు భయపడాలి తప్ప, మంచి వారు భయపడాల్సిన పని లేదని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలపై తగిన సమాచారం అందించి, నేరాల అదుపునకు సహకరించాలని ధీరజ్ వినీల్ విజ్ఞప్తి చేశారు. పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్ఐ అవినాష్ పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో మహిళ నుంచి సమస్యను తెలుసుకుంటున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

విద్య, ఆరోగ్య హక్కుల పరిరక్షణకు సీసీఆర్ వినతి

గుడ్లవల్లేరు: జాతీయ స్వచ్ఛంద సంస్థ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్(సీసీఆర్) ఆధ్వర్యంలో ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం డీఎంహెచ్‌ఓ, డీఈఓ కార్యాలయాల్లో వినతి పత్రాలను సోమవారం ఆ సంఘ సభ్యులు పెయ్యల సురేష్ బాబు, జంగాల నాగేంద్రరావు, కాండ్రు అలెగ్జాండర్ అందించారు. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత సీట్ల అమలుపై స్పష్టత డీఈఓను కోరామన్నారు. పేద విద్యార్థులకు న్యాయమైన అవకాశాలు లభించేందుకు ఇది చాలా కీలకమని పేర్కొన్నారు. అలాగే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్– 2010ను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం–2019 ప్రకారం ఆరోగ్య సేవలపై బాధ్యత వహించే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం సమర్పించామన్నారు. సామాజిక చైతన్యం పెరిగేందుకు ప్రతి పౌరుడు సీసీఆర్‌లో భాగస్వామి కావాలంటూ పిలుపునిచ్చారు.



వినతిపత్రాన్ని అందిస్తున్న సీసీఆర్ సభ్యులు

మండలి కృష్ణారావుకు ఘన నివాళి

కైకలూరు: దివిసీమ గాంధీగా పేరు గాంచిన మండలి వెంకటకృష్ణారావు పుట్టిన ఊరు కైకలూరు మండలం పల్లెవాడ. ఆయన జయంతి సందర్భంగా సోమవారం పల్లెవాడలో కృష్ణారావు విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణారావు బావ చందన విష్ణువర్ధనరావు ఆధ్వర్యంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ 1977లో దివిసీమ ఉప్పెన సమయంలో మండలి ప్రజలకు అనేక సేవలు చేశారని పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్ల వ్యతిరేక ధర్నాను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: ప్రజలపై విపరీతమైన విద్యుత్ భారాన్ని మోపేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం నాయకులు మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్న విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. ప్రజలను మోసం చేస్తున్న ఈ విధానాన్ని వ్యతిరేకించేందుకు ప్రజా సంఘాల ఐక్యవేదిక ధర్నా చేపడుతుందన్నారు. పట్టణ ప్రజలు ఈ ధర్నాలో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, ఎల్. సురేంద్ర, పి. రజిని. జి. ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం. – వి.వి.ఆర్.ఎస్.ఆర్. ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో 2017–18 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆ పాఠశాల పూర్వ విద్యార్థిని, హైదరాబాద్ ఐసీఐసీఐ బ్యాంక్ డెప్యూటీ మేనేజర్ బూబత్తిన సాయి ధనూష ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులను ఉద్దేశించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అవరోధించాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఆమె చెప్పారు. అపజయాన్ని కూడా విజయంగా స్వీకరించాలన్నారు. ఈ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. అనంతరం ఆమెను సన్మానించారు. పూర్వ విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. పూర్వ విద్యార్థులు దేవి యశశ్రీ, దిగ్విషాలు తమ శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించి ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఎ.కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ జి.ఎం. సత్యబాబు పాల్గొన్నారు.



ముఖ్య అతిథి ధనూషను సన్మానించిన పూర్వ విద్యార్థులు

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం



పెనమకూరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న సీడీపీఓ ప్రసన్నవిశ్వనాథ్

తోట్లవల్లూరు: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పెనమకూరు అంగన్‌వాడీ కేంద్రం(3)లో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు సోమవారం జరిగాయి. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రిపాలు తాగించటం ద్వారా వ్యాధినిరోధక శక్తి వస్తుందని తెలిపారు. తల్లి పాల ద్వారా బిడ్డలు ఆరోగ్యవంతంగా ఎదగటానికి అవకాశం ఉంటుందని సూచించారు. సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ మరీదు మధుబాబు, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వెంట్రప్రగడలో..

వెంట్రప్రగడ (పెదపారుపూడి): పుట్టిన బిడ్డకు గంట లోపు తల్లిపాలు అందేలా చూస్తే ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ వెంట్రప్రగడ సెక్టార్ సూపర్‌వైజర్ శివనాగమణి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ శివారు పెద దళితవాడలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొవ్వలో..

భట్లపెనుమర్రు(మొవ్వ): మండలంలోని భట్లపెనుమర్రు పంచాయతీ పరిధిలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల పర్యవేక్షణలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వారోత్సవాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయ్యంకి జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ ప్రసన్నవిశ్వనాథ్‌తో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి మాట్లాడారు. పుట్టిన బిడ్డకు అరగంటలోపు ముర్రుపాలు పట్టించాలన్నారు.



దానిగూడెంలో తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న సూపర్‌వైజర్ ప్రసూన

కైకలూరులో..

కైకలూరు: తల్లిపాలు పోషకాహార గని వంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ప్రసూన అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కైకలూరు శివారు దానిగూడెంలో తల్లిపాలపై బాలింతలు, గర్భిణులకు సోమవారం అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాలు పట్టించడం వలన బిడ్డలో జ్ఞాపక శక్తి పెరుగుదలతో పాటు రోగ నిరోధక శక్తి సమకూరుతుందన్నారు. జీఎంఎస్‌కే ఉమాసాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.భాగ్యలక్ష్మీ, చిన్నితల్లి, ఎస్‌కే భావని, పీపీ రమణ పాల్గొన్నారు.

నేడు విస్తృత స్థాయి సమావేశం

కైకలూరు: కైకలూరు రైల్వేస్టేషన్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము సోమవారం తెలిపారు. కార్యక్రమంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై చర్చిస్తామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయ కర్త దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పాల్గొంటారని తెలిపారు. కైకలూరు మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

రైతుల పక్షాన నిరంతర పోరాటం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

మొవ్వ: రైతుల సమస్యల పరిష్కారానికి వారి పక్షాన నిరంతరం పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. కైలే అనిల్‌కుమార్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి సోమవారం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం తహసీల్దార్ మస్తాన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఎరువుల కొరతను, ప్రైవేటు ఎరువుల దుకాణదారులు చేస్తున్న దోపిడీని తహసీల్దార్‌కు వివరించారు. ఈ సందర్భంగా కైలే మాట్లాడుతూ ఎరువుల కొరతకు పర్యవేక్షణా లోపమే ప్రధాన కారణమన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు ఎరువులు అందించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపంతోనే ఎరువులు కొంతమంది అధికార పార్టీకి చెందిన వారికో.. పలుకుబడి ఉన్నవారికే అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి, డెప్యూటీ సీఎం, మంత్రి లోకేష్, వ్యవసాయ శాఖ మంత్రి గానీ నోరు మెదపక పోవటం దారుణమన్నారు.



నాయకులు, రైతులతో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళుతున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

రైతుల కష్టాలు వర్ణనాతీతం

రెండు నెలలుగా ఎరువులు కొరతతో రైతులు పడుతున్న కష్టం వర్ణనా తీతంగా మారిందని కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల అమ్మకాలను నిలిపి వేసిన ప్రభుత్వం పీఏసీఎస్ ద్వారా ఎరువులను అందించటంలో విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో పామర్రు నియోజకవర్గ పరిధిలో ఎరువులు, సాగు నీరు అందలేదని ఎన్నడూ రైతుల నుంచి ఫిర్యాదు అందిన దాఖలాలు లేవన్నారు. కేవలం రైతులకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు మరిచి పోవాలనే ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాలను కూటమి నిర్వీర్యం చేస్తోందన్నారు.

ఎమ్మెల్యే కుమార్‌రాజా అబద్ధాలు మానుకో..

అన్నదాతలకు ఎరువులు అందక ఇబ్బందులు పడుతుంటే రైతులందరికీ ఎరువులు అందుతున్నాయని ఎమ్మెల్యే కుమార్ రాజా అబద్ధాలు చెప్పటం మానుకోవాలన్నారు. అలాగే రైతుల పక్షాన తాను వినతిపత్రాన్ని ఇచ్చేందుకు తహసీల్దార్ కార్యాలయాలకు వెళితే తాను అన్నదాత సుఖీభవ పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడని ప్రచారం చేయటం తగదన్నారు. పామర్రు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో తనకు ఎక్కడా సెంటు వ్యవసాయ భూమిలేదన్నారు. ఎమ్మెల్యేలకు, మాజీ ఎమ్మెల్యేలకు గాని అన్నదాత సుఖీభవ రాదనే విషయంపై మినిమమ్ నాలెడ్జ్ లేని నాయకుడు కుమార్ రాజా అన్నారు. ఏడాదికి 20 వేల వంతున అన్నదాత సుఖీభవ ద్వారా అందిస్తామని బాండులు రాసిచ్చిన కూటమి ప్రభుత్వం ఏడు లక్షల మందికి వివిధ కారణాలతో కోత వేసిందన్నారు. పంటల బీమా ప్రీమియం డబ్బులు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. తొలుత గ్రామంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యారా సాయి ప్రశాంత్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మండ శ్రీనివాసరెడ్డి, నాయకులు చిమటా రాఘవేంద్రరావు, తాతా రాంబాబు, డొక్కు కృష్ణ, నాయకులు పేకేటి సీతారామిరెడ్డి, అంగడాల నగేష్, కొడమంచిలి నాంచారయ్యతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తప్పుడు ప్రచార వీడియోను చూపిస్తున్న కైలే అనిల్‌కుమార్

నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని ధర్నా

మొవ్వ: అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద ఉన్న పని చేయని ఫోన్లు తీసుకుని, నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని కార్యకర్తలు సోమవారం సాయంత్రం సీడీపీఓ కార్యలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీఓ ఎస్.ప్రసన్నవిశ్వనాథ్‌కు తమ సమస్యలను విన్నవించారు. దీనికి సీడీపీఓ స్పందిస్తూ ఉన్నతాధికారులు దృష్టికి సమస్యలను తీసుకెళ్తానని హామీ ఇచ్చారని కార్యకర్తలు తెలిపారు.

పామర్రులో..

పామర్రు(మొవ్వ): అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన ఫోన్లు సరిగా పనిచేయటం లేదని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోవటంతో కార్యకర్తలు పామర్రు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంగాధర్ ప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు కే ఉమారాణి, బి.పద్మజారాణి, కె.చిన్నారి, ఎం.అరుణ నిర్మల జ్యోతి, ఎం.సువర్ణలత పాల్గొన్నారు.



పామర్రులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురులో శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ మాసం సందర్భంగా చండీహోమం చేశారు. సాయంత్రం స్వామికి పంచహారతులు, పల్లకీసేవ నిర్వహించారు.

నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద కేంద్రం

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. ఈ కేంద్రంలో కనీసం ఒక కేజీ వర్మీ కంపోస్టు తయారు చేయలేదు. మండల స్థాయి అధికారులు ఇద్దరూ దీనిని గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం కచ్చితంగా వర్మీకంపోస్టు తయారు చేయాలని చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కొత్తగా బోర్డులు మాత్రం ఏర్పాటు చేశారుగానీ వర్మీకంపోస్టు తయారీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు ఆదాయం పెంచాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని నిరుపయోగంగా మార్చారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సంపద కేంద్రాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



మోపర్రులో నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద కేంద్రం